# సరోరుహ వ్యూహం

తల్లి తండ్రుల మాటలకీ, పెద్దల హితవచనాలకీ ఎన్నడూ అసమ్మతి తెలియజేయని ఈ ఇరవైయేళ్ల జీవితంలో సాత్యకి ఇవేళ ఎదిరించాడు అంటే దానిక్కారణం తార.

కాలేజీ చదువు. అక్కడ స్నేహాలు. ఆ నగర జీవితం. పుస్తకాలు. సినిమాలు. కొత్త కొత్త ఆదర్శాలు. తెలీకుండానే అతడిలో పెద్ద మార్పు వచ్చింది.

ఇప్పుడు అనురాగాలకూ, ఆదర్శాలకూ మధ్య సంఘర్షణ మొదలయింది. దానిక్కూడా కారణం తారనే. తన క్లాస్‌మేట్. తన స్నేహితురాలు. క్లాస్ లో ఆమె ఒక ప్రత్యేక ఆకర్షణ. అందంతోనే కాదు. తెలివైనది. ఆమె క్లాస్ ఫస్ట్. లెక్చరర్‌లకి ముద్దుల శిష్యురాలు.

ఆమె స్నేహానికి తనకి ఉన్న ఒకే ఒక్క యోగ్యత వారింట్లో ఓ గదిలో అద్దెకు ఉండడం.

ఈ మాఘమాసంలో పెళ్లి కావలసిందే అని తండ్రి పట్టుదల. నేను ఇంకో అయిదారేళ్లు అసలు చేసుకోను. చదువు - ఎమ్.ఎ. వరకు పూర్తవ్వాలి. ఉద్యోగంలో చేరాలి. అప్పుడు. అంతేకాదు..... నేను ఇష్టపడే అమ్మాయిని మాత్రమే చేసుకుంటాను. నాకు కుల మతాల భేదం లేదు. కులాంతర వివాహమే ఇష్టం. పూలదండల పెళ్లిళ్లు నాకు ఇష్టం. పెద్దల కుదిర్చిన జాతకాల పెళ్లిళ్లు నాకు పడవు. ఈ కులమత ద్వేషాలు పోవాలంటే - కులాంతర, మతాంతర వివాహాలే శరణ్యం అని గట్టిగానే చెప్పాడు.

ఈసారి సెలవులకు ఊరు వచ్చినపుడు ఈ పెళ్లి సమస్య మళ్లీ ఎదురయింది.

అర్ధరాత్రి చీకట్లో తన గదిలో మంచం మీద ఆలోచనలతో సతమతమవుతూ - నిద్రరాక - తల్లిదండ్రులకు ఎట్లా నచ్చచెప్పాలో తోచక.... తన పట్టుదల ఎట్లా నెరవేర్చుకోవాలో అర్థంకాక...

పల్లెటూరు. తండ్రి చదువు అంతో ఇంతో. మేనమామ, చిన్నాన్న పెదనాన్నలు, ఇతర బంధువులు, ఊళ్లో వాళ్లు - అందరికీ తెలిసి పోయింది.... అంతా తనకు నచ్చజెప్పేవాళ్లే.

పెళ్లి ఒత్తిడి. ఆ కాబోయే పెళ్లికూతురు పధ్నాలుగేళ్లు కూడా నిండని చిన్నపిల్ల. తమ కులంలో చిన్ననాటే పెళ్లిళ్లు. అది ఆచారం.

పెద్ద ఆస్థి. ఒకటే దృష్టి... తండ్రికి. ఆ తలిదండ్రులకు ఒకే ఒక అమ్మాయి. అట్లాంటి

సంబంధం వస్తే ఎగరేసుకు వెళ్లి పోవటానికి ఎందరో ఎదురు చూస్తున్నారట. కోరి వచ్చిన సంబంధం. మంచి కుటుంబం. అమ్మాయి రూపసి. ఎనిమిదో తరగతి ఊళ్లో స్కూల్ చదువుతో ముగిసింది. తనపట్ల వాళ్లు శ్రద్ధచూపడానికి ఒక కారణం - బి.ఏ చదువుకుంటున్న అబ్బాయి. మంచి కుటుంబం. తండ్రి ఊళ్లో పెద్దమనిషి. పదిమందికి అవసరానికి సహాయపడే మనిషి. తన గ్రామంలో కాలేజీలో చదువుకుంటున్న వాడు ఒక్కడే. సాత్యకి! బుద్ధిమంతుడు!

చలి. చీకటి. మంచుకురుస్తున్నది. ఉత్తరగాలులకు చెట్లు గజగజ వణుకుతున్నాయి. మూగవోయినట్టుంది చుట్టూరా ప్రకృతి. తలుపు తెరచి బయటకు చూస్తూ కూర్చున్నాడు చాలాసేపు. దిక్కుతోచటంలేదు. ఊరంతా చీకట్లో నిద్రపోతున్నది.

తార పదే పదే గుర్తొస్తున్నది.

ఆ చీకట్లో, తోటల్లో కొబ్బరి చెట్ల మధ్య కాలిబాటలో నడుస్తూ... ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్టేషన్‌కి. రైల్లో విశాఖపట్నం. ఉదయం పది గంటలకల్లా తన గదికి. తారకోసం వెతుకుతున్న చూపులతో.... తార స్నేహితురాలి పుట్టిన రోజు పండగకు రాత్రి వెళ్లి ఇంకా తిరిగి రాలేదట.

* * *

'నేనేమైపోతానో.....'అంది తార ఓసారి.

ఏ ఆసరాలేని తల్లి. రైలు ప్రమాదంలో చనిపోయాడు తండ్రి..... పదేళ్ల కిందట. పెద్ద మావయ్య క్విట్‌ఇండియా ఉద్యమంలో ఆంగ్లపాలకుల పోలీస్ కాల్పుల్లో చనిపోయాడు. రెండో మావయ్య రెండో ప్రపంచ యుద్ధంలో బర్మాలో చనిపోయాడు. ఒకే ఒక చెల్లెలు అత్తవారి కష్టాలు పడలేక, ఏడ్చి ఏడ్చి, ఏ దిక్కుతోచక బావిలో పడి చనిపోయింది.

ఆస్తి పెద్దగా మిగల్లేదు. కొద్ది నెలల్లో ఏదో ఉద్యోగంలో తను చేరకపోతే..... జీవితం ఏమయిపోతుందోనన్న భీతి....

తల్లిని ఆదుకోవాలి. తల్లిని కాపాడుకోవాలి.

'నేనున్నాను కదా!' అనాలనుకున్నాడు సాత్యకి. అయినా గొంతు పెగల్లేదు. ఇంకా తను విద్యార్థి. ఇంకో ఏడాదికి గాని బి.ఎ. పూర్తి కాదు. ఎమ్.ఎ. చదువు తర్వాతనే ఉద్యోగం. ఆదాయం.

'బంధువులు ఎవరున్నారో బొత్తిగా తెలీదు నాకు. వచ్చిపోయే బంధువులు - చుట్టపుచూపుగా చూసి వెళ్లే వాళ్లే తప్ప సహాయపడేవాళ్లుకారు.....'

'అప్పట్లో నాన్నగారికి ఇక్కడ ఉద్యోగం దొరకడంతో పల్లెటూరు విడిచి మేము ఇక్కడకు

వచ్చేయడం జరిగింది. పల్లెటూరులో ఆస్థినంతటినీ అమ్మ అమ్మేసి ఈ ఇల్లు కొనుక్కున్నాం. మిగిలిన డబ్బు బ్యాంకులో వేసింది. ఆ డబ్బే ఇంతవరకు ఆదుకుంది.....'

తార తల్లి జానకమ్మ, కూతురు పెళ్లి విషయం బెంగపెట్టుకుంది. ఎవ్వరూ దిక్కులేరు. ఎలా? పల్లెటూళ్లో సంబంధం చూస్తే అక్కడ బతుకు..... చదువుకున్న ఈ అమ్మాయికి సరిజోడు దొరుకుతుందా? గులాబీ పువ్వును బురదలో పడేసినట్టు అవుతుందే తప్ప. తాము కట్నాలు కానుకలు ఇవ్వలేరు.

కాలేజీ విడిచాక సాయంత్రం నీరెండలో వచ్చి ప్రశాంతంగా ఉన్న ఆ ఇంట్లో అడుగుపెట్టాడు సాత్యకి. తెరుచుకుంటున్న తలుపులు కిర్రుమని మూలిగాయి.

తార రేడియో వింటూ కూర్చుని ఉన్నది. ఆ పాటల్లో లీనమై పోయినట్టుంది. తను వచ్చినట్టు గుర్తుపట్టలేదు. పాటలు ఆమెకు చాలా ఇష్టం. తనవేపు తార చూడనన్నా చూడలేదని బాధపడ్డాడు సాత్యకి. తనగదిలో కొద్దిసేపు కూర్చుని ముఖం కడుక్కుని - 'రావచ్చా' అనుకుంటూ సగం చేరవేసిన తలుపు తెరుచుకుంటూ లోపలికి వెళ్లి మంచంమీద కూర్చున్నాడు.

'ఎందుకు టెలిగ్రాం? ఎవరికన్నా ఆపద....'

కాదని తలూపి చెప్పాడు.

'మరి?'

'పెళ్లి చేసుకోమని ఒత్తిడి'

అపస్వరం వినిపించినట్టుంది.... కొద్ది సేపు ఆమె నోట కూడా మాట రాలేదు.

'చేసుకోనని స్పష్టంగా చెప్పాను.'

'తండ్రి, బంధువుల ఒత్తిడి. కాబోయే పెళ్లికూతురు తండ్రి ఆస్థి పరుడు. ఒకే ఒక్క కూతురు.'

అతడి మాటలు తడబడుతున్నాయి. గొంతు అపశ్రుతులు పలుకుతున్నది. మనసులో కల్లోలం....

వంటగదిలో కాయగూరలు తరుగుతూ వింటున్న జానకమ్మ కల్పించుకుని 'నాన్న ఒత్తిడి అంటున్నావు. ఒత్తిడి కాదది వాళ్ల బాధ్యత కదా?'

'ఇంత చిన్న వయసులో పెళ్లిచేసుకోవడం ఇష్టంలేదు.'

'అదే చెప్పి వాళ్లని ఒప్పించాలి నువ్వు' అన్నారామె.

'ముందు నా చదువు పూర్తి కావాలి.... నాలుగయిదేళ్లు కనీసం ఆగమని చెప్తుంటే.....'

* * *

ఆ మరుసటి రోజు సాయంత్రం తండ్రి గోపాలస్వామి వచ్చాడు కొడుకు దగ్గరికి.

ఆయన ఆందోళనపడినట్టున్నాడు. కొడుకు చెడిపోతున్నాడనే కోపంతో కుమిలిపోతున్నట్టు కన్పించాడు. తండ్రిని చూస్తే ఒకప్పుడు ఎంతో సంతోషం. కాని ఇప్పుడు ఆ రూపం చూసి భయపడ్డాడు.

తండ్రి మొదట్లో కోప్పడ్డాడు. 'ఇంట్లో చెప్పకుండా అర్ధరాత్రిపూట పారిపోయి రావటం ఎందుకు?' అని తండ్రి బాధ. కొడుకు మొండి పట్టుదల మీద కోపం. మంచీ చెడూ అర్థం చేసుకోవటం లేదు ఎందుకని ఆవేదన. తల్లి కన్నీళ్లతో కుమిలిపోతున్నది. ఊళ్లో అంతా ఇదే చెప్పుకుంటున్నారు. ఏం బాధ పెట్టారో..... ఏమిటో..... చేతికందిన కొడుకుని హింసిస్తున్నారని మా పై అపనిందలు. ప్రేమగా పెంచారు, పెద్దచదువులు కోసం కాలేజీలో చేర్పితే వీడికి కొమ్ములొచ్చాయి. తల్లి తండ్రులను లక్ష్య పెట్టడంలేదు అని నిన్నూ నిందిస్తున్నారు. ఎవర్తో అంటున్నది. నీవు ఇక్కడ ఎవర్తెనో చేసుకుంటావని?'

తండ్రి మాటలు శాంతంగా విన్నాడు సాత్యకి. తండ్రి బాధపడి చెప్తున్నాడు. తన ప్రవర్తన ఇంతటి జ్వాలకు కారణమయిందా అని పరితపించాడు. తన తెలివితక్కువతనానికి నిందించుకున్నాడు. తన మొండిపట్టుదల మూర్ఖత్వంగానే కన్పించింది.

'ఈ పెళ్లి కాకపోతే యింకోటి. కాని వాడిని బాధపెట్టొద్దు' అని మొత్తుకుంటున్నది మీ అమ్మ. నిన్ను చూడందే..... నీ ఇష్టమే కానివ్వు. ఊరికి పద. రెండ్రోజాలుండి మళ్లీ వచ్చేయ్' కాలేజీకి రెండ్రోజులు సెలవు ఉంది. 'అలాగే' నని తల ఊపాడు కిందికి చూస్తూ సాత్యకి.

* * *

జానకమ్మ ఉత్తరం పూర్తిగా చదివింది. విషయం అర్థమయింది. ఎదుట కూర్చుని ముఖం మీద చెప్పలేక సందేహించి నీరజ ఉత్తరం రాసింది. రాయవచ్చా రాయకూడదా, తను జోక్యం చేసుకోవచ్చా అని సందేహించి చివరకు సాహసించి ఉత్తరం రాసింది. నీరజకు తన వద్ద ఆమాత్రం చనువు లేదా? తనతో చెప్పేందుకు భయం ఎందుకు? మేలు, కీడు ఎంచుకుని చేయాల్సిన పని కదా? మాట్లాడితే ఏం తప్పు?

రెండు హృదయాలు అనురాగాల ఆకర్షణతో సన్నిహితమైతే పెద్దలు ఆశీర్వదించి అక్షతలు చల్లాలి.

ఉత్తరం సారంశం అది.

పిల్లల సుఖసంతోషాలకోసం తల్లితండ్రులు అవసరమైతే కొన్ని త్యాగాలు చేయవలసి ఉంటుంది. దాన్ని విస్మరిస్తే ముందు ముందు పశ్చాత్తాపడవలసి వస్తుందేమో.

ఈ మాటలు చెప్పుకునే సాన్నిహిత్యం నీరజకు తన వద్ద లేకపోయిందా?

నీరజ ఉత్తరం ఎంతో సంతోషాన్ని కలిగించింది.

తార పెళ్లి.....

* * *

ఊళ్లో పరిస్థితి అంతా తనకు విరుద్ధంగా ఉంది. సాత్యకి తట్టుకోలేకపోతున్నాడు. విచిత్రం ఏమిటంటే తన స్నేహితులు సైతం తనకు బుద్ధి చెప్తున్నారు. తల్లి తండ్రులను కష్టపెట్టిన కొడుకు ఉంటే ఎంత లేకపోతే ఎంత అని ఒక స్నేహితుడు అన్నాడు. ఊరు ఊరంతా ఇదే మాట. పెద్దచదువులు చదివిస్తే వీడికి పిచ్చెక్కింది. పెద్దలు కులాచారాలు వల్లిస్తున్నారు. తాను పెళ్లి చేసుకోవాలనుకుంటున్న అమ్మాయి కుటుంబం పేదవాళ్లు. పట్నంలో ఇల్లు తప్ప ఏ ఆస్థిపాస్థి లేని వాళ్లు. పైగా పెద్దకులం వాళ్లు. బ్రాహ్మణులు. ముందు ముందు ఏ సమస్యవచ్చినా ఆదుకునే వాళ్లు లేరాయే. సాత్యకి తెలివి తక్కువతనానికి కొంతమందయితే అతడి ముఖానే తిడుతున్నారు. తండ్రి మంచివాడు. దాంతో వీడి నాటకాలు సాగుతున్నాయి అని దూషిస్తున్నారు.

తన ఆశయాలు, ఆదర్శాలు గొప్పవి. మంచివి.

అయితే తల్లిదండ్రుల ప్రేమ ఇంకా గొప్పది. తల్లిదండ్రులకు ఏ పరిస్థితిలోనూ మనస్తాపం కలిగించకూడదు. తలిదండ్రులను నొప్పించకూడదు. ప్రేమతోనే తలిదండ్రులను ఒప్పించాలి. వారిని మెప్పించాలి. ఇప్పటికి పెళ్లి వాయిదా వేస్తే సరిపోతుంది. చదువు.... చదువు.... ఉద్యోగం...... ఇంకో అయిదారేళ్లు.... అపుడు పెళ్లి..... తన పక్షాన ఒక్కళ్లు కూడా ఊళ్లో - మాటాడటం లేదు....

తనకీ కాలేజీ చదువులేకపోతే.... ఇతర స్నేహితులమల్లె అంగీకరించేవాడే.....

ఆలోచనలతో నిద్ర లేదు. అర్థరాత్రి దాటిపోయింది.

'ఊహూ నూతిలోనో గోతిలోన పడిచస్తాను. యేం చెప్పకు. నా కొద్దు.... నేను వినను. విననంటే వినను.'

సాత్యకి కలవరిస్తున్నాడు. ప్రక్కనే నిద్రపోతున్న తల్లి కలవరపడి లేచింది. లేచి కూర్చున్న తల్లి 'జయా, జయా' అని పిలిచింది. ఆమె ముద్దుగా పిలిచే పేరది.

సాత్యకి తల్లి గొంతువిని లేచి కూర్చున్నాడు. 'ఆ!' అని ప్రక్కనే తన మీద చెయ్యివేసిన తల్లి చెయ్యిపట్టుకున్నాడు.

'కలవరిస్తున్నావా జయా?' అడిగింది అన్నపూర్ణ.

'ఆ? ఆ? లేదు లేదు' నిద్రగొంతు.

'ఏమీ లేదు పడుకో....' సాత్యకి పడుకున్నాడు. నిద్ర మళ్లీ ముంచుకొచ్చింది.

దుప్పటి కప్పి వాడి మంచం మీద కూర్చున్నది. ఆమెకి నిద్ర రావటంలేదు. ఆ రాత్రి ఆ మాతృమూర్తి దేవుని ప్రార్థిస్తూ జాగరణ చేసింది. తెల్లవారిన తర్వాత భర్తతో

జరిగిన సంగతి చెప్పింది. వాడి యిష్టమే కానీయండని ప్రాధేయపడింది. భర్త కోపగించుకుంటాడని ఆమెకు తెలుసు. అదే జరిగింది.

* * *

'ఈ దినం మిమ్మల్ని కలుసుకోవాలని మూడుసార్లొచ్చాను.'

'చెప్పింది నీరజ'

'ఎందుకో భయం భయంగా ఉంది'

సాత్యకి ప్రేమకథ తెలిసిన మారుతీరావు 'ఊ చెప్పు' అని చిరునవ్వు నవ్వాడు.

'రాత్రొక స్వప్న మొచ్చింది'

క్షణం మౌనం. మారుతీరావు కళ్లల్లోకి చూస్తేనే చాలు తన భయాలన్నీ మాయమవుతాయి.

'ఊ పూర్తిగా చెప్పు'

'ఒక మామిడి చెట్టుంది. చాల పెద్దచెట్టే. దానికి ఒకటే ఒక పండుంది. అందని ఎత్తులో. క్రింద గంపలో నిండా కాయలున్నాయి. దారిన పోయిన పెద్దమనిషి ఒకరు ఆ పండును గాని, ఆ గంపలోని కాయల్ని గాని చూడనన్నా చూడకుండా వెళ్లిపోయాడు. ఒక పల్లెటూరి పిల్ల చెట్టుమీద ఉన్న పండును చూసి 'అది తీసుకో... తీయగా ఉంటుంది.' అని చెప్పింది. గంపనిండా కాయలు కాళ్ల దగ్గర ఉన్నా వాటి మీద నాకు మనసులేదు. ఎవరో నన్ను పిలిచారు. నేను వెళ్లబోయాను. ఆ తొందరలో ప్రక్కనే ఉన్న గంప తగిలి నేను కిందపడిపోయాను. అంతలో నేను నిజంగానే కలలో పడినట్లే మంచంమీంచి కిందకి పడిపోయాను' అని తన స్వప్నం వివరంగా చెప్పి తన చూపులు దించుకున్నాడు సాత్యకి.

స్వప్నాలకు అర్థం ఉంటుందా అని అడిగినప్పుడుమారుతీరావు అర్థాలు ఉంటాయి అన్నాడు ఇదివరలో.

సాయం సమీరం చల్లగా ఉంది. సంజకాంతుల మనోహరంగా మార్ధవంగా ఉన్నాయి. ప్రకృతి అనంతంలోకి మారితీరావు చూపులు సాగి అక్కడే ఆగాయి.

'నీ హృదయంలో ఉన్న బాధకి సంకేతం. ఆ చెట్టుకి అందకుండా ఉన్నపండు..... తారకావచ్చు. క్రింది కాళ్ల దగ్గరే ఉన్న గంపలోని కాయలు - ఊళ్లో మీ బంధువులు కావచ్చు. ధైర్యంగా ఉండు. ఏది మనకు మంచిదో అదే జరుగుతుంది.' అని భుజం తట్టి ధైర్యం చెప్పాడు.

మారుతీరావును చూస్తే చాలు ఎంతో ధైర్యం, సంతోషం. ఇపుడు అదే సంతోషం ముంచుకొచ్చింది.

* * *

మారుతీరావు యూనివర్సిటీలో ఫిలాసఫీ లెక్చరర్. ఆయన విద్యార్థి జ్ఞానేశ్వర్ ద్వారా తొలిపరిచయం. విద్యార్థుల పట్ల ఆయనకు ఎంతో ప్రేమ. వాళ్లు ఇంటికి వస్తే వాళ్లతో ఎన్నెన్నో ముచ్చట్లు చెబుతారు. అవన్నీ తనకు కొత్త. డార్విన్, సోక్రటీస్, ఫ్రాయిడ్, కార్ల్ మార్క్స్, అబ్రహాం లింకన్, న్యూటన్, రవీంద్రనాథ్ టాగోర్, శరత్ బాబు - ఈ పేర్లన్నీ తనకు కొత్త.

వారం దినాల తర్వాత మారుతీరావును కలుసుకునేందుకు మరోసారి వెళ్లాడు సాత్యకి. ఆయన ఇంట్లో ఒక్కడే ఉన్నాడు.

'భయమేస్తోందండీ. రోజూ పాడుకలలొస్తున్నాయి'

సాత్యకి కళ్లల్లో ఆ భయం కన్పిస్తున్నది.

చిన్నగా నవ్వి, 'కలలు ప్రతి ఒక్కరికి వస్తాయి. కలలు కలలే. భయమెందుకు?'

'రాత్రి - వచ్చిన కలలో - ఒక చిన్న పాము నన్ను తరుముతూ నా వెనకాలే వస్తున్నది. అది..... నేను వెనక్కి తిరిగి చూస్తే కొండచిలువంత పెద్దదయి - నన్ను వెంటాడుతున్నది. నేను పరుగెత్తాను. ఆ పరుగులో చూసుకోలేదు. ఎదురుగా ఉన్న అగ్ని గుండంలో పడిపోయాను. బాగా కాలిపోయి అరుస్తూ కూర్చున్నాను. అంతలో ఒక గుర్రమొచ్చింది. నన్ను తన మీద ఎక్కించుకుని పరుగుతీసింది.'

'ఊ ఇంకా?'

'రెండోది బాగా గుర్తురావటం లేదు. తార నేను సముద్రం ఒడ్డున కూర్చున్నాం..... అంతే గుర్తుంది.'

మారుతీరావు చాలాసేపు శూన్యంలోకి చూస్తూ మౌనంగా ఉండిపోయాడు.

'ఒక పని చెయ్యి. ఈ శనివారం సింహాచలం వెళ్లి ఆ వరాహ నర్సింహస్వామిని మొక్కుకుని రా'

సాత్యకి నెలకి ఒకసారన్నా సింహాచలం వెళ్లి పూజలు చేసుకుని వస్తాడు. చాలాసార్లు స్నేహితులు ఐదారుగురు కలిసి వెళ్తారు.

'దేనికి బెంగపెట్టుకోకూడదు. ఏది జరిగినా మన మంచికే.... అంటారు పెద్దలు. నీవు మంచిగా ఉండటం ముఖ్యం. మన మంచే మనల్ని కాపాడుతుంది. నీ ధైర్యమే నీకు రక్ష. భయం మన బలహీనత వలన కలుగుతుంది.' అని భుజం మీద చెయ్యివేసి సాత్యకిని ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు మారుతీరావు.

'ఈ వయసులో అందరికీ వచ్చే సమస్యలే ఇవి' అని కూడా ఓదార్చాడు.

* * *

ఈ రోజు తార ప్రవర్తన చిత్రంగా ఉంది. చిరునవ్వుతో పలకరించే తార తనవేపు

చూడనన్నా చూడటంలేదు. కాలేజీ నుండి ఇల్లు చేరేదాక తార ముభావంగా ఉంది. ఆ నిర్లక్ష్య స్వభావం తనకు కొత్త. తనను ఎవరో మోసం చేస్తున్నట్టు నిరాశ. రాత్రి భోజనం సహించలేదు. గది తలుపులు మూసేసుకుని పడుకున్నాడు.

అతని కళ్ల ముందు ఏవేవో ప్రత్యక్షమవుతున్నాయి. ఏదో ఊగుతోంది పోల్చుకోవటానికి వీలులేనంత వేగంతో. ఏమిటది....? ఉరితాడు.... చీకటి లోంచి దూసుకుని 'రంయ్' మంటూ ఓ మెరుపు ముక్క తన మీదికు దూసుకు వస్తున్నది. తన కళ్లముందు క్రూరంగా కదుల్తున్నది. కత్తి.... గాజు గ్లాసులో నాలుగు చుక్కలు పడ్డాయి. ఆ గ్లాసు తన పెదవుల మీదికి బలవంతంగా వస్తున్నది..... విషం! అతడు కళ్లు మూసుకున్నాడు. అతని శరీరం మీంచి పోయేందుకు మారణ భీభత్సం చేస్తూ, తన మీదికి దూకుతూ ఫీంకరిస్తూ వస్తోంది..... రైలు.....

సాలెగూడులో చిక్కిన కీటకంలా ఉంది తన పరిస్థితి.

చావే పరిష్కారమేమో......

సరిగ్గా అదే సమయంలో మారుతీరావు అక్కడ ప్రత్యక్షం కావటంతో వరదప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడికి పడవవాడు కాపాడినట్టయింది.

* * *

రంగయ్య అంటే చిన్ననాటి నుండి గౌరవం అన్నపూర్ణకు. ఇంట్లో దిక్కులేక ఇరవైయ్యవ ఏటనే రంగూన్ వెళ్లిపోయాడు. ఆ రోజుల్లో చాలామంది యువకులు బర్మా వెళ్లిపోతూ ఉండేవాళ్లు. అక్కడ ఉద్యోగం సంపాదించాడు. అక్కడ నుండి కలకత్తా వచ్చి రెండో ప్రపంచ యుద్ధంలో సైనికుడిగా చేరాడు. ఆ యుద్ధం ముగిసిన తర్వాత క్విట్ ఇండియా ఉద్యమం. రైల్వేలో మళ్లీ ఉద్యోగం. చదువుకున్నది అయిదో తరగతే అయినా లోకం పోకడ అర్థంచేసుకున్నవాడు. పెళ్లి, పిల్లలు..... అంతా ఇప్పుడు ఖరగ్‌పూర్‌లో. తను చివరకు స్వగ్రామం వచ్చేశాడు. పదెకరాల తోట కొనుక్కొని ఇప్పుడు వ్యవసాయం చేసుకుంటున్నాడు. పెద్ద కొడుకు గెజిటెడ్ రేంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు ఖరగ్‌పూర్‌లోనే. రంగయ్య అంటే ఊళ్లో అందరికీ పెద్దదిక్కు అని ప్రేమ.

అన్నపూర్ణ తన కష్టసుఖాలన్నీ అతనితో చెప్పుకుంటుంది. కొడుకు పెళ్లి తన గుండెల మీద కుంపటే అయిందని ఆమె కన్నీళ్లతో చెప్పుకుంది.

కులాంతర్వివాహాలు తప్పు కాదని రంగయ్య నచ్చచెప్పాడు అన్నపూర్ణకి. ఈ పెళ్లి ఒప్పుకోమని. పెళ్లి మన ఊళ్లోనే చేయించాలని కూడా చెప్పాడు.

ఇప్పుడు సాత్యకి చదువైతే పూర్తయింది కదా. ఉద్యోగం......

సరిగ్గా అట్లాంటి సమయంలోనే మారుతీరావు రాసిన ఉత్తరం పోస్ట్‌మాన్ తెచ్చి ఇచ్చి వెళ్లాడు.

ఆ ఉత్తరం పట్టుకుని రంగయ్య దగ్గరకు వెళ్లింది అన్నపూర్ణ. ఆయన ఆ ఉత్తరం సాంతం చదివి వినిపించాడు.

చాలాసేపు నిశ్శబ్దంగా ఉంది. మా శ్రేయోభిలాషి.....మారుతీరావు.

కాని అన్నపూర్ణకి కన్నీళ్లు ఆపుకోవడం సాధ్యం కాలేదు.

ఆ దుఃఖం ఉప్పొంగిపోయిన కొద్దిసేపటి తర్వాత పమిటచెంగుతో కళ్లుతుడుచుకుని నిస్సహాయంగా రంగయ్యని చూసింది.

రంగయ్యగారి మాటని నలుగురూ బలపరచిన ఫలితమే గోపాలస్వామి విశాఖపట్నం ప్రయాణం. తారతో సాత్యకి వివాహ నిర్ణయం!

* * *

శిశిరం వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసమయం అది. పాత కొత్తల మేలుకలయిక ఆరోజు. పట్నపు నాజూకుతనం పల్లీయుల నిరాడంబరమైన ప్రేమలో అడుగు పెడుతున్న అదృష్టఘడియ. మలిసంజ పున్నమి వెన్నల మధురిమలో కళకళలాడుతున్న అపూర్వ సందర్భమది. యువతరం సాహసంతో నవభావం పరిమళిస్తున్న సౌందర్యశోభ అది.

పెళ్లి సందడితో ఊరంతా కళకళలాడుతున్నది. నూతనోత్సాహంతో కోలాహలంగా ఉంది. అక్కడ మనుషుల ముఖాలలో ఆనందం ఉప్పొంగుతున్నది.

అందమైన పూలతో, పచ్చటి కొబ్బరి కమ్మలతో పెళ్లి మండపం చూడముచ్చటగా ఉంది.

మంగళవాయిద్యాలతో సందడి సందడిగా ఉంది.

పెళ్లికూతురు పెళ్లికొడుకు పెళ్లి పీటల మీద కొత్త బట్టలతో...... అందరి దృష్టి వారిమీదే.

పురోహితులు మంత్రాలు వల్లిస్తున్నారు. జానకమ్మ కళ్లల్లో ఆనందం.....

నీరజ పెద్దరికాన్ని తిలకిస్తూ ఓప్రక్క కూర్చున్నాడు మారుతీరావు. రంగయ్య పురోహితులకు మధ్య మధ్య తమ ఆచారసంప్రదాయాలు గుర్తుచేస్తున్నాడు.

సాత్యకి తార మెడలో మూడుముళ్లు వేసి తాళికట్టి కూర్చున్నాడు. మంగళసూత్రం ఆమె మెడలో తళతళలాడింది.

ఎక్కడో ఆ సందడిలో......

'ఆ ?'

'పెళ్లికొడుకు తండ్రి?'

కలవరం.....గోల......

'కనిపించడం లేదు. లేడు. ఊళ్లోలేడు.'

పురోహితులూ, రంగయ్యా కలిసి లేచిపోతుంటున్న సాత్యకిని పెళ్లిపీటల మీద బలవంతంగా కూర్చోబెట్టారు.

* * *

సాత్యకి శోభనం గదిలో ఉండాల్సిన సమయానికి పిచ్చాసుపత్రిలో ఓ మంచం విశ్రాంతి సమయం అంతమయింది.

అనురాగాలూ, ఆదర్శాలూ పన్నిన సరోరుహవ్యూహంలో పడ్డట్టు సాత్యకి ఆ మంచం మీద పడ్డాడు.

*

*ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, 28-09-1960*